

మంత్రి ఇలాక.. పట్టించుకోక

రవాణ శాఖ మంత్రి ఇలాకాలోనే రోడ్ల దుస్థితి అధ్వానంగా మారింది.

వివరాలు 8లో ▸



సమీకృతం.. పనులు సగం

చేర్యాలలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో చేపట్టిన సమీకృత కార్యాలయ భవన నిర్మాణం ఏళ్లు గడుస్తున్నా పూర్తి కావడంలేదు.

వివరాలు 8లో ▸



డంపింగ్ యార్డుతో అవస్థలు

జిల్లా కేంద్రానికి సమీపంలో ఉన్న పసల్వాది గ్రామంలో డంపింగ్ యార్డ్ సమస్య మళ్లీ మొదలైంది.

వివరాలు 9లో ▸

సంగారెడ్డి టు రాయిచూర్!

సన్న వడ్లు కొంటున్న కర్నాటక వ్యాపారులు

- నిజామాబాద్ మిల్లర్లు సైతం సేకరణ
- సర్కారుకు తప్పుతున్న సన్నాల కిరికిరి
- కొనుగోలు కేంద్రాలకు నామమాత్రంగా తెస్తున్న రైతులు

సాక్షి ప్రతినిధి, సంగారెడ్డి: జిల్లాలో ప్రభుత్వానికి సన్న వడ్ల కొనుగోలు కిరికిరి తప్పుతోంది. ఈ రకాలను ప్రైవేటు వ్యాపారులు, మిల్లర్లే ఎక్కువగా కొనుగోలు చేస్తుండటంతో కొనుగోలు కేంద్రాలకు ఈ రకాలు నామమాత్రంగా వస్తున్నాయి. ప్రధానంగా కర్నాటకకు చెందిన మిల్లర్లు ఎక్కువగా ఈ రకం వడ్లను కొనుగోలు చేసుకుని తీసుకెళుతున్నారు. రాయిచూర్ ప్రాంతానికి చెందిన వ్యాపారులు ఈ సన్నవడ్లు కొనుగోలు చేశారు. అలాగే నిజామాబాద్ జిల్లాకు చెందిన మిల్లర్లు కూడా చాలా మటుకు ఈ సన్న రకాలను సేకరించారు. దీంతో ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు నామమాత్రంగా వస్తున్నాయి.

ఇక్కడి నిబంధనలూ కారణమే..

సన్న ధాన్యానికి క్వింటాలుకు రూ.500 బోనస్ ఇస్తున్న ప్రభుత్వం.. ఈ ధాన్యం కొనుగోలుకు పలు నిబంధనలు పెట్టింది. నిర్ణీత పరిమాణంలో మించి గింజ సైజు ఉండకూడదు. అలాగే తేమ శాతం 17 లోపు ఉండాలి. తాలు లేకుండా ప్రతి ధాన్యం బస్తాను ప్యాడి క్లీనర్లతో క్లీన్ చేయించి ఇవ్వాలి. ప్రభుత్వం ప్రకటించిన జాబితాలో ఉన్న రకాలనే తీసుకుంటున్నారు. పైగా ఆయా మండల వ్యవసాయశాఖ అధికారులు వచ్చి ఇది సన్న రకమేనని సర్టిఫై చేస్తేనే సన్న ధాన్యాన్ని కొంటున్నారు. మరోవైపు ఈ సన్నాల సేకరణకు ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఆ కేంద్రాలకు తీసుకెళితేనే ఈ వడ్లను తూకం వేస్తున్నారు. ఇలా పలు నిబంధనలు ఉండటంతో రైతులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల కంటే ప్రైవేట్ వ్యాపారులకు విక్రయించేందుకే ఎక్కువగా మొగ్గు చూపుతున్నారు.

ప్రైవేట్ వ్యాపారులు ధరలో కోత పెడుతున్నా..

ప్రైవేటు వ్యాపారులు ధర తగ్గించినప్పటికీ.. తేమ శాతం ఎక్కువ ఉన్నప్పటికీ కొనుగోలు చేస్తుండటంతో కొందరు రైతులు వ్యాపారులకే విక్రయిస్తున్నారు. ప్రైవేటు వ్యాపారులు క్వింటాలుకు రూ.2,300 వరకు వెచ్చించి సన్నాలను కొంటున్నారు. సర్కారు కొనుగోలు కేంద్రాల్లో క్వింటాలుకు రూ.500 బోనస్ కలుపుకుంటే రూ.2,820 వరకు గిట్టుబాటు అవుతోంది. కానీ ప్రైవేటు వ్యాపారులు తేమ శాతం అధికంగా ఉన్నా కొనుగోలు చేస్తుండటంతో.. రైతులు వీరి మొగ్గు చూపుతున్నారు.

ప్రభుత్వం కొన్నది ఐదు శాతం లోపే..

జిల్లాలో ఈ ఖరీఫ్ కొనుగోలు సీజనులో సుమారు 10,000 మెట్రిక్ టన్నుల సన్న రకం ధాన్యం కొనుగోలు చేయాల్సి ఉంటుందని జిల్లా అధికారులు అంచనా వేశారు. ఈ మేరకు కొనుగోలు ప్రణాళికను సిద్ధం చేశారు. కానీ ఇప్పటి వరకు కేవలం 465 క్వింటాళ్లు మాత్రమే సన్నరకం ధాన్యం కొనుగోలు చేశారు. అంటే ముందస్తు అంచనాలో కనీసం ఐదు శాతం కూడా సన్న రకం ధాన్యం సర్కారు జిల్లాలో సేకరించలేదంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. మరోవైపు చాలా మంది రైతులు ఈ సన్న రకం ధాన్యాన్ని మర ఆడించి బియ్యాన్ని విక్రయించుకున్నారు. దీంతో సర్కరు కొనుగోలు కేంద్రాలకు నామమాత్రంగా ధాన్యం వచ్చింది.



పుల్కల్(అందోల్): ధాన్యం బస్తాలను లారీలో లోడ్ చేస్తున్న హమాలీలు

తూకంలో కోత.. రైతన్న వెత

రైస్‌మిల్లర్ల ఇష్టారాజ్యం

పుల్కల్(అందోల్): రైతులకు రైస్‌మిల్లు యజమానులు చుక్కలు చూపిస్తున్నారు. ధాన్యంలో కోత విధిస్తూ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. 17 శాతం కంటే ఎక్కువ ఉంటే తేమశాతం ఎక్కువగా ఉందని.. అంతకంటే తక్కువ ఉంటే బరువు రావడం లేదని తూకంలో కోత పెడుతున్నారు. ఇటీవల పుల్కల్ మండలం సింగూరు కొనుగోలు కేంద్రం నుంచి తేమశాతం 9 వచ్చిన ధాన్యం లారీని కోడూరు అన్నపూర్ణ రైస్ మిల్లుకు పంపించారు. మిల్లు యజమాని వడ్లు ఎక్కువగా ఎండడం వల్ల తరుగు వస్తుందని లారీకి 5 సంచుల కోత విధించాడు. పైగా తేమశాతం 17కు ఎక్కువ గాని, తక్కువ గాని ఉండకూడదని చెప్పాడు. ధాన్యం తూకం వేసేటప్పుడు 42.300 కిలోలు అదనంగా తూకం వేస్తున్నా.. రైసుమిల్లు వద్ద అదనంగా కోతలు విధిస్తున్నారని రైతులు వాపోతున్నారు. ఆరబోసిన ధాన్యం 17 శాతం వరకు ఎండిందని ఏఈఓ ధ్రువీకరణ చేసిన వారం రోజుల వరకు వివిధ కారణాలతో ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్దే ఉంటుందని చెబుతున్నారు. వివిధ కారణాలు చూపుతూ ధాన్యాన్ని వారం రోజుల తర్వాత రైస్‌మిల్లుకు తరలిస్తున్నారని అన్నారు. ధాన్యం తరలింపు ఆలస్యం కావడంతో పూర్తిగా ఎండి 10 లోపు తేమ శాతం చూపిస్తుందన్నారు. దీంతో తూకంలో తేడా వస్తుందని, మేం నష్టపోతామని రైస్‌మిల్లు యజమానులు కోతలు విధిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

న్యూస్‌రీల్

నేడు మంత్రి దామోదర పర్యటన

వట్‌పల్లి(అందోల్)/కొండాపూర్(సంగారెడ్డి): అందోలు, పుల్కల్ మండలాల్లో వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సి.దామోదర రాజనర్సింహ మంగళవారం పర్యటించనున్నట్లు అధికారులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అందోలు, పుల్కల్ మండలాల్లో రూ.8.47కోట్ల రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేయనున్నారు. అలాగే రూ.4.69కోట్ల నిధులతో పుల్కల్ మండలం కోడూరు ఎక్స్ రోడ్డు నుంచి వయా బొమ్మారెడ్డిగూడెం మీదుగా కొండారెడ్డిపల్లి ఎక్స్‌రోడ్డు వరకు; రూ.2.38 కోట్ల నిధులతో అందోలు మండలం డాకూర్ పీడబ్ల్యూ రోడ్డు నుంచి వయా మాసానిపల్లి మీదుగా పోతిరెడ్డిపల్లి ఎక్స్‌రోడ్డు వరకు; రూ.1.40 కోట్లతో రోళ్లపాడ్ గేటు నుంచి రోళ్లపాడ్ గ్రామం లోపలి వరకు కొత్త రోడ్డు నిర్మాణ పనులకు మంత్రి దామోదర్ శంకుస్థాపన చేయనున్నారు. అదే విధంగా కొండాపూర్ నుంచి గారకుర్తి మీదుగా సదాశివపేట వరకు రోడ్డు మంజూరైంది.

27న నిధి ఆప్కే నికట్ 2.0

పటాన్‌చెరు టౌన్: సమస్యల పరిష్కారానికి ఈ నెల 27న నిధి ఆప్కే నికట్ 2.0 నిర్వహించనున్నట్లు ప్రాంతీయ భవిష్యనిధి కమిషనర్ విశాల్‌అగర్వాల్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని అంబేడ్కర్ కాలనీ, సదాశివపేట్ అయ్యప్పస్వామి దేవస్థానం సమీపంలోని సెయింట్ మేరీస్ హైస్కూల్, పాశమైలారం మెటల్ క్రాఫ్ట్ ఫోమింగ్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్‌లో ఉ. 9:30 నుంచి సాయంత్రం 5:45 గంటల వరకు శిబిరాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. భవిష్యనిధి సమస్యలు ఉన్న వారు పరిష్కరించుకోవాలని సూచించారు.

కలెక్టరేట్‌లో సేంద్రియ ఉత్పత్తుల అమ్మకాలు



కలెక్టరేట్‌లో విక్రయిస్తున్న సంఘం సభ్యులు

సంగారెడ్డి జోన్: సేంద్రియ ఎరువులతో తయారు చేసిన వ్యవసాయ ఉత్పత్తులను కలెక్టరేట్ కార్యాలయ ఆవరణలో విక్రయాలు జరిపారు. సోమవారం ఝరాసంగం మండల పరిధిలోని బిడెకన్నె గ్రామ శివారులోని అరణ్య శాశ్వత వ్యవసాయ సంస్థ సహకారంతో మహిళా రైతు ఉత్పత్తి దారుల సంఘం సభ్యులు విక్రయించారు. సేంద్రియ ఎరువులతో తయారు చేసి, ఉత్పత్తి చేసిన పప్పు దినుసులు, పచ్చళ్లు, నూనె, బిస్కెట్లతో పాటు తదితర ఉత్పత్తులను అమ్మారు. అధికారులు కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపించారు.

29న కార్తీక దీపారాధన

నారాయణఖేడ్: కార్తీకమాస దీపోత్సవాన్ని పురస్కరించుకుని ఈనెల 29న మనూరు మండలం బోరంచలో భోగేశ్వరస్వామికి రుద్రాభిషేకం, రుద్రహోమం నిర్వహించనున్నట్లు సేవాదళ్ బాధ్యులు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సద్గురు సోమలింగ శివాచార్య ఆధ్వర్యంలో పార్థివలింగ రుద్రాభిషేకం, శివపార్వతుల కల్యాణోత్సవం, కార్తీక దీపారాధన, గురువుగారి అమృత ఉపదేశం, మహామంగళహారతి, అన్నప్రసాద వితరణ, భజన కార్యక్రమాలను ఉంటాయన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

అక్రమ కేసులను ఎత్తివేయాలి

ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ వెంకటయ్య



మాట్లాడుతున్న వెంకటయ్య

సంగారెడ్డి టౌన్: లగచర్ల ఘటనలో అమాయకులను అరెస్టు చేశారని వారిపై కేసులను ఎత్తివేయాలని ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు. సోమవారం కందిలోని సెంట్రల్ జైలులో ఉన్న బాధితులను పరామర్శించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. ఘటన జరిగి పది రోజులు దాటినా ఇప్పటికే గ్రామస్తులు భయాందోళనలో ఉన్నారని, లగచర్ల రొట్టిబండ తండాల్లో కమిషన్ బృందం పర్యటించిందని తెలిపారు. పోలీసులు అమాయకులపై దాడి చేసి అక్రమ కేసులు బనాయించి అరెస్టు చేశారన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి లగచర్ల కేసులో క్షేత్రస్థాయి నివేదిక ఇస్తామని, వారిని విడుదల చేయాలని కోరుతామని చెప్పారు. కలెక్టర్‌పై దాడి ఘటన దురదృష్టకరమని, కానీ అమాయకులను జైల్లో పెట్టారన్నారు. 41 సీఆర్పీ కింద అట్రాసిటీ కేసులో స్టేషన్ బెయిల్ ఇప్పిస్తామన్నారు.

చదువులో పోటీతత్వం పెంచాలి

- ఎమ్మెల్యే సంజీవరెడ్డి
- సక్రునాయక్ తండా పాఠశాల తనిఖీ



విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

నారాయణఖేడ్: చదువులో పోటీతత్వం పెంచి విద్యార్థులు జిల్లాలోనే ప్రథమ స్థానం వచ్చేలా అధ్యాపకులు కృషి చేయాలని ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి అన్నారు. నాగల్‌గిద్ద మండలంలోని సక్రునాయక్ తండాలోని ప్రాథమిక పాఠశాలను సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరును పరిశీలించారు. అనంతరం అధ్యాపకుడిలా విద్యార్థులకు పాఠ్యాంశాలను బోధించి పలు ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. విద్యార్థుల హాజరు శాతం పెంచాలని, సమయానుకూలంగా హాజరు కావాలని ఉపాధ్యాయులకు సూచించారు. పాఠశాల పరిసరాలు, మధ్యాహ్నం భోజనం వండే ప్రాంతం పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని వంట కార్మికులకు సూచించారు. తండాల్లోని పాఠశాలలన్నీ తిరిగి పరిశీలించి హాజరు శాతం పెరిగేలా చూడాలని ఎంఈవోను ఫోన్‌లో ఆదేశించారు. ఎమ్మెల్యే వెంట నాయకులు పండరిరెడ్డి, సిద్దారెడ్డి తదితరులు ఉన్నారు.

పాఠశాలల్లో మౌలిక వసతులపై ఆరా

కొడకంచి పాఠశాలను సందర్శించిన ట్రైనీ ఐఏఎస్‌ల బృందం



కొడకంచి ప్రభుత్వ పాఠశాలను సందర్శించిన అధికారులు

జిన్నారం (పటాన్‌చెరు): జిన్నారం మండలం కొడకంచి గ్రామంలో ఐదు మంది ట్రైనీ ఐఏఎస్ అధికారులు సోమవారం పర్యటించారు. గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. పరిపాలన అంశాలలో భాగంగా విద్యాపరమైన అంశాలు మౌలిక వసతులు సమస్యలు బోధన పద్ధతులను అడిగి తెలుసుకున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో విద్యాభివృద్ధికి ఉపాధ్యాయులు చేస్తున్న కృషిపై సంతృప్తి వ్యక్తం చేశారు. పాఠశాలను సందర్శించిన ఐఏఎస్ బృందం సభ్యులకు ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు ప్రేమావతి, ఉపాధ్యాయులు మొగిలి మాల తదితరులు పాల్గొన్నారు.

'గురుకుల' ప్రిన్సిపాల్‌పై వేటు



ఆహారంలో పురుగులను పరిశీలిస్తున్న అడిషనల్ కలెక్టర్ మాధురి

కొండాపూర్(సంగారెడ్డి): గిర్మాపూర్ సాంఘిక సంక్షేమ పాఠశాల ప్రిన్సిపాల్‌పై సస్పెన్షన్ వేటు పడింది. ఆయన్ను సస్పెండ్ చేస్తూ సోమవారం కలెక్టర్ వల్లూరు క్రాంతి ఉత్తర్వులు జారీ చేశారు. ఇటీవల కొండాపూర్ మండలం గిర్మాపూర్‌లో ఉన్న సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని తల్లిదండ్రులు ఆందోళన చేసిన నేపథ్యంలో కలెక్టర్ ఆదేశాల మేరకు అదనపు కలెక్టర్ మాధురి ఉదయం తనిఖీ చేశారు. గురుకులంలో నాణ్యమైన భోజనాలు అందించడం లేదని, పారిశుద్ధ్య లోపం, పాఠశాల సమస్యలు పరిష్కరించడంలో ప్రిన్సిపాల్ సుధాకర్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నట్లు గుర్తించారు. ఆ మేరకు అదనపు కలెక్టర్ ఇచ్చిన నివేదిక ఆధారంగా కలెక్టర్ సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. అడిషనల్ కలెక్టర్ వెంట ఎంపీడీఓ శ్రీనివాస్, డిప్యూటీ తహసీల్దార్ ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

ఐదు ప్రైవేట్ ఆస్పత్రుల సీజ్

జిన్నారం (పటాన్‌చెరు): నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న ప్రైవేటు ఆసుపత్రులపై వైద్యాధికారులు కొరడా ఝుళిపించారు. ఈ సందర్భంగా ఐదు ఆస్పత్రులను సీజ్ చేశారు. సోమవారం గుమ్మడిదల మండలం అన్నారం గ్రామంలో అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న బీపీఎల్ ఆసుపత్రిని జిల్లా వైద్యాధికారి గాయత్రీ దేవి ఆదేశాల మేరకు మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అధికారి మధుకర్ తనిఖీ చేశారు. ఆర్ఎంపీ కేంద్రాలలో ప్రథమ చికిత్స మాత్రమే చేయాలన్నారు. అలా కాకుండా ఆపరేషన్లు నిర్వహిస్తున్న వాటిపై విచారణ జరిపి చర్యలు చేపట్టారు. ఈ నిబంధనలు ప్రతి ఒక్కరికి వర్తిస్తాయన్నారు.

కలెక్టరేట్‌లో షార్ట్ సర్క్యూట్

- కంప్యూటర్, ప్రింటర్, ఇతర సామగ్రి దగ్ధం
- పరిశీలించిన కలెక్టర్ క్రాంతి



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

సంగారెడ్డి జోన్: కలెక్టరేట్ కార్యాలయంలోని ముఖ్య ప్రణాళిక అధికారి కార్యాలయంలో అగ్నిప్రమాదం సంభవించింది. వివరాల్లోకి వెళ్తే.. సోమవారం ఉదయం కార్యాలయం శుభ్రం చేస్తుండగా ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. గమనించిన సిబ్బంది అప్రమత్తమై మెయిన్ స్విచ్ఆఫ్ చేసి ఫైర్ సిబ్బందికి సమాచారం ఇవ్వగా ఘటనా స్థలానికి చేరుకొని మంటలార్పేశారు. అప్పటికే కార్యాలయంలోని కంప్యూటర్, ప్రింటర్, టేబుల్‌తోపాటు సామగ్రి దగ్ధమయ్యాయి. కార్యాలయాన్ని కలెక్టర్ వల్లూరు క్రాంతితోపాటు అధికారులు పరిశీలించి ఘటనపై పూర్తి స్థాయి విచారణ చేపట్టాలని ట్రాన్స్‌కో, అగ్నిమాపక శాఖను ఆదేశించారు. ఘటనలో జరిగిన నష్టాన్ని అంచనా వేసి, అవసరమైన చర్యలు తీసుకోనున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఆయా శాఖల కార్యాలయాల్లో ఉన్న ఫైర్ సేఫ్టీ పరికరాలు సరిగా పని చేస్తున్నాయా లేదా పరిశీలించి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని ఆయా శాఖల అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

అర్జీలను తక్షణమే పరిష్కరించండి

- కలెక్టరు వల్లూరు క్రాంతి
- ప్రజావాణికి 60 దరఖాస్తులు



ప్రజావాణిలో దరఖాస్తులు స్వీకరిస్తున్న కలెక్టర్

సంగారెడ్డి జోన్: ప్రజావాణిలో వచ్చిన ప్రజల సమస్యలను క్షేత్ర స్థాయిలో పరిశీలించి, వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ వల్లూరు క్రాంతి అధికారులను ఆదేశించారు . సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణికి జిల్లాలోని వివిధ ప్రాంతాల ప్రజలు తమ సమస్యలు తెలుపుకొనేందుకు వచ్చారు. మొత్తం 60 ఫిర్యాదులు అందాయని అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజావాణి కార్యక్రమం అనంతరం ఫిర్యాదులు ఆన్‌లైన్‌లో నమోదు చేయడం, వాటిని పర్యవేక్షించి, సకాలంలో పరిష్కరించాలని కోరారు. ప్రజావాణి ద్వారా వచ్చిన ఫిర్యాదులను పెండింగ్‌లో ఉంటే వేగంగా పరిష్కరించాలని ఆదేశించారు. అధికారుల సమస్యలపై సత్వరమే స్పందించాలని చెప్పారు. ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు అధికారులు తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ చంద్రశేఖర్, ట్రైనీ కలెక్టర్ మనోజ్, డీఆర్ఓ పద్మజరాణి పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలను నిలిపి వేయాలి

సంగారెడ్డి పట్టణంలోని బైపాస్ రోడ్డు ఎంపీడీఓ ఆఫీస్ ఎదురుగా ప్రభుత్వ స్థలంలో సర్వే నంబర్ 374/1 ఖాళీ స్థలంకు సంబంధించి అక్రమంగా 5 ఇంటి నంబర్లను కేటాయించారు. దాని ద్వారా అక్రమ నిర్మాణాలు మొదలుపెట్టారు. ఈ విషయంపై ప్రజావాణి కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్, ఉన్నత అధికారులకు ఫిర్యాదు చేశారు. వెంటనే చర్యలు తీసుకోవాలని టెలికాం బోర్డు అడ్వైజరీ కమిటీ మెంబర్ ప్రసాది రవిశంకర్, బీజేపీ మున్సిపల్ కౌన్సిలర్లు నాయికోటి రమేష్, కసిని వాసు, మందుల నాగరాజు, పట్టణ అధ్యక్షులు ద్వారక రవి డిమాండ్ చేశారు.

పెన్షన్ ఇప్పించండి



మా కుమారుడు పేరు విగ్నేష్, గ్రామం జోగిపేట, మండలం ఆందోల్. మానసికంగా వికలాంగుడు, నడవడానికి రాదు. మా కుమారుడికి గతంలో పెన్షన్ వచ్చేది. గత సంవత్సర కాలంగా పెన్షన్ రాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. పేదలైన మాకు కుటుంబ పోషణ భారంగా మారింది. అధికారులు చర్యలు తీసుకుని పెన్షన్ ఇప్పించగలరు.

-విగ్నేష్‌తో పాటు తల్లిదండ్రులు

పట్టా పాసుపుస్తకం పంపించండి



నా పేరు గౌరమ్మ, పగడిపల్లి, నారాయణఖేడ్ మండలం. చాలా సంవత్సరాలుగా ఆరు ఎకరాల 38 గుంటల విస్తీర్ణం భూమిలో పంటలు సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాము. తన పేరుపై పట్టా పాసు పుస్త కం అందించాలని పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. అధికారులు చర్యలు తీసుకుని మా తాత పేరు నుంచి నా పేరు పైకి భూమి మార్చి పట్టా పాసు పుస్తకం అందించగలరు.

-కె.గౌరమ్మ, పగడిపల్లి, నారాయణఖేడ్

అక్రమంగా నిర్మించిన షెడ్లు తొలగించాలి



నా పేరు విటాబాయి, గ్రామం. కుబాతండా మండలం నాగల్ గిద్ద. నాకు సంబంధించి అనుభవంశిఖంగా ఉన్న పట్టా భూమి మూడు ఎకరాల విస్తీర్ణంలో అక్రమంగా షెడ్లు ఏర్పాటు చేశారు. పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా.. రెండు నెలల్లో తొలగిస్తామని చెప్పి 9 నెలలు ముగిసినా ఇప్పటివరకు తొలగించలేదు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు చర్యలు తీసుకొని అక్రమంగా నిర్మించిన షెడ్లు తొలగించాలి.

-విటాబాయి, కుబాతండా

సోయా.. ధర లేదయా..!

- మద్దతు ధర క్వింటాలుకు రూ.4,892
- రూ.4వేల లోపు కొంటున్న వ్యాపారులు
- విధిలేక ఇళ్లలో నిల్వ చేస్తున్న రైతులు

జహీరాబాద్ టౌన్: మార్కెట్‌లో సోయాబీన్ ధర భారీగా పడిపోయింది. మద్దతు ధర క్వింటాలకు రూ.4,892 ఉండగా మార్కెట్‌లో రూ.4వేల లోపే పలుకుతుంది. పంటకు మద్దతు ధరకు అదనంగా రూ.500 బోనస్ ఇస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చింది. బోనస్ పక్కన పెడుతే కనీసం మద్దతు ధరకు కొనుగోలు చేయడం లేదు. రైతుల బలహీనతను చూసుకుని వ్యాపారులు ఇష్టానుసారంగా ధాన్యం కొంటున్నారు. దీంతో అన్నదాతలు తీవ్రంగా నష్టపోతున్నారు.

ఖరీఫ్ పంటల్లో సోయాబీన్ కీలకమైంది. జిల్లాలో వరి, పత్తి, కంది, మొక్కజొన్న తర్వాత అత్యధికంగా సాగయ్యేది సోయాబీన్. జిల్లాలో ఈ వానాకాలంలో సుమారు 82,818 ఎకరాల్లో పంట సాగు చేయగా.. ఇందులో జహీరాబాద్ వ్యవసాయ డివిజన్‌లో అత్యధికంగా ఉంది. తీవ్ర వర్షాభావ పరిస్థితుల కారణంగా పంటలు దెబ్బతిని దిగుబడి పడిపోయింది. కాత పూత దశలో కూడా భారీ వర్షాలు కురడం వల్ల పంటల దిగుబడిపై ప్రభావం చూపింది. ఈ నష్టాన్ని ధర రూపంలో అయినా తీర్చనుందని రైతులు ఆశతో ఉన్నారు. కానీ సోయాబీన్ పంటకు గిట్టుబాటు ధర లేక రైతులు నష్టపోతున్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర క్వింటాలకు రూ. 4,892 కాగా వ్యాపారులు మాత్రం రూ.4 వేలకు లోపు కొనుగోలు చేస్తున్నారు. కొంత మంది రైతులు గత్యంతరం లేక తక్కువ ధరకు అమ్ముకుంటుండగా మరికొంత మంది రైతులు ఇళ్లలో పంటను నిల్వ చేసుకుంటున్నారు. పంట చేతికి వచ్చిన తర్వాత ధర పడిపోయింది. జహీరాబాద్ డివిజన్ పరిధిలో ఝరాసంగంలో కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేశారు. ఉత్పత్తిలో నాల్గో వంతే కొనుగోలు చేయడం వల్ల మిగిలిన పంటను మార్కెట్‌లో వ్యాపారులకు అమ్ముకోవాల్సి వస్తుంది. న్యాల్‌కల్ మండలం గంగ్వార్ వద్ద ప్రైవేట్ వ్యక్తులు కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసిన క్వింటాలుకు రూ.4,170 కొంటున్నారు. జహీరాబాద్ ఓపెన్ మార్కెట్‌లో నాలుగు వేలకు వరకు కొనుగోలు చేస్తున్నారు. దీంతో కొంత మంది రైతులు సాయాబీన్‌ను ఇళ్లలోనే నిల్వ చేసుకుంటున్నారు.



గౌసాబాద్‌లోని ఓ ఇంటిలో నిలువ చేసిన ధాన్యం



జహీరాబాద్ మార్కెట్‌కు వచ్చిన సోయాబీన్

ధరలేక నష్టపోతున్నాం

నేను ఐదు ఎకరాల్లో సోయా పంట వేశా. సుమారు 50 క్వింటాళ్ల పంటను తీశా. పంటను అమ్ముదామంటే మార్కెట్‌లో ధర లేదు. ఇప్పుడున్న ధరకు అమ్మితే నష్టపోవాల్సి వస్తుంది. మార్కెట్‌లో తేమ ఉన్న పంటను కొంటలేరు. అందుకని ఇంటిలోపల పంటను నిలువ చేసి ఉంచా. మా గ్రామంలో సుమారు 400 క్వింటాళ్ల వరకు రైతులు ధాన్యం నిల్వ చేశారు.

-వీరప్ప, రైతు, గౌసాబాద్

క్లుప్తంగా

రావి ఆకుపై రాజ్యాంగ చిత్రాలు


చిత్రాలతో శివకుమార్

నారాయణఖేడ్: రాజ్యాంగాన్ని ఆమోదించి మంగళవారం నాటికి 75 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్‌కు చెందిన పత్రచిత్రకారుడు గుండు శివకుమార్ రావి ఆకుపై భారత రాజ్యాంగ నిర్మాత డా.బీ.ఆర్ అంబేద్కర్‌తో పాటు పార్లమెంటు భవనం, రాజ్యాంగ చిత్రం జాతీయ చిహ్నాలను మలచి దేశ ప్రజలకు వినూత్నంగా భారత రాజ్యాంగ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

నల్లమందు కేసులో ఇద్దరికి ఐదేళ్లు జైలు

- రూ.25 వేలు జరిమానా


నిందితులతో పోలీసులు

పటాన్‌చెరు టౌన్ :నల్లమందు కేసులో ఇద్దరు నిందితులకు కోర్టు జైలు శిక్షతోపాటు జరిమానా విధించింది. ఎక్సైజ్ సీఐ పరమేశ్వర గౌడ్ కథనం మేరకు.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నర్సీపట్నంకు చెందిన రమణ, సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్‌కు చెందిన రవీందర్ 2016లో పటాన్‌చెరు పరిసరాల్లో నల్లమందు రవాణా చేస్తూ పట్టుబడ్డారు. అప్పట్లో వీరిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. నిందితులు ఇద్దరిని సోమవారం ఎక్సైజ్ పోలీసులు కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి ఇద్దరికీ ఐదేళ్ల జైలు శిక్ష, రూ.25 వేలు చొప్పున జరిమానా విధించారని ఎక్సైజ్ పోలీసులు తెలిపారు.

పోక్సో కేసు నమోదు

మద్దూరు(హుస్నాబాద్): బాలికను మాయమాటలతో మోసం చేసి గర్భవతిని చేసిన నేరానికి నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు పోలీసులు సోమవారం తెలిపారు. మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలికను కొమురవెల్లికి చెందిన ఓ వ్యక్తి మాయమాటలతో మోసం చేసి లైంగిక వేధింపులకు పాల్పడ్డాడు. కొద్ది రోజులకు బాలిక గర్భవతి కావడంతో విషయం తెలుసుకున్న బాధితురాలి తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

కొండచిలువ ప్రత్యక్షం

- గ్రామస్తుల దాడిలో మృతి


గాగిళ్లాపూర్‌లో కొండచిలువ

బెజ్జంకి(సిద్దిపేట) : మండలంలోని గాగిళ్లాపూర్‌లో సోమవారం కొండచిలువ ప్రత్యక్షమవడంతో గ్రామస్తులు భయాందోళనకు గురయ్యారు. వివరాల్లోకి వెళ్తే.. గ్రామ శివారులో ఉండే పిల్లి వాగు నుంచి ఎస్టీ కాలనీ వైపునకు వచ్చిన కొండచిలువ స్థానికులు చూశారు. ఈ క్రమంలో గ్రామ శివారులోకి తరలించడానికి ప్రయత్నిస్తూ దాడి చేయడంతో మృతి చెందింది. కొద్ది నెలల కిందట కూడా కొండ చిలువ కనపడటంతో ఫారెస్ట్ అధికారులకు అప్పగించినట్లు తెలిపారు. గ్రామ శివారులోని ముల్ల పొదలను తొలగించాలని కోరుతున్నారు.

ఏటీఎంలో చోరీకి విఫలయత్నం

సిద్దిపేటకమాన్: గుర్తు తెలియని వ్యక్తులు ఏటీఎంలో చోరీకి విఫలయత్నం చేసిన ఘటన సిద్దిపేట పట్టణంలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. సిద్దిపేట టూటౌన్ పోలీసుల కథనం మేరకు.. పట్టణంలోని రేణుకానగర్‌లో ఇండియా వన్ ఏటీఎంలో 4న రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి విఫలయత్నం చేశారు. తెల్లవారుజామున ఏటీఎం సెక్యూరిటీ గార్డు చూడగా ధ్వంసమై ఉంది. విషయాన్ని బ్యాంకు అధికారులకు తెలిపారు. మూడు రోజుల కిందట ఏటీఎం నిర్వాహకుడు వెంకట్ రెడ్డి ఫిర్యాదు మేరకు సోమవారం పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

యువకుడి అదృశ్యం

సిద్దిపేటకమాన్: యువకుడు అదృశ్యమైన ఘటన సిద్దిపేట పట్టణంలో చోటు చేసుకుంది. సిద్దిపేట వన్ టౌన్ సీఐ వాసుదేవరావు కథనం మేరకు.. పట్టణంలోని భరత్‌నగర్‌కు చెందిన సుతారి వెంకటేశ్ (25) ఆటో నడుపుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. ఐదు రోజులుగా జ్వరంతో బాధపడుతూ ఇంట్లోనే ఉన్నాడు. ఆదివారం అర్ధరాత్రి లేచి చూడగా ఇంట్లో కనిపించకలేదు. కుటుంబీకులు చుట్టుపక్కల, తెలిసిన వారి వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. యువకుడి తల్లి ఎల్లవ్వ ఫిర్యాదు మేరకు సోమవారం పోలీసులు కేసు నమోదు చేశారు.

మంత్రి ఇలాక.. పట్టించుకోక

అక్కన్నపేట మండలంలో అధ్వానంగా రోడ్లు

- కంకర పోసి బీటీ మరిచిన వైనం
- బిల్లులు అందక వదిలేసిన గుత్తేదారు
- రాకపోకలకు నిత్యం నరకం
- రవాణ శాఖ మంత్రి ప్రాంతంలోనే ఈ దుస్థితి
- అటు వైపు కన్నెత్తి చూడని అధికారులు


కంకర పోసి వదిలేసిన కట్కూర్ నుంచి దాస్‌తండా రహదారి

అక్కన్నపేట(హుస్నాబాద్): రవాణ శాఖ మంత్రి ఇలాకాలోనే రోడ్ల దుస్థితి అధ్వానంగా మారింది. ఒకటి కాదు.. రెండు కాదు.. ఏకంగా నాలుగైదు నెలలుగా రాళ్లు తేలిన దారుల్లోనే వాహనదారులు నరకయాతన అనుభవిస్తున్నారు. రోడ్డు టెండర్ తీసుకున్న గుత్తేదారు కంకరం పోసి మధ్యలో వదిలేశాడు. ప్రభుత్వం నుంచి బిల్లులు రాకపోవడంతో నిలిపేసినట్లు తెలిసింది.

అక్కన్నపేట మండలం కట్కూర్ నుంచి దాస్‌తండా, వంకాయతండా వయా పంచరాయి తండాలకు గత ప్రభుత్వ హయాంలో గిరిజన శాఖ ఆధ్వర్యంలో దాదాపు రూ.3.20 కోట్ల నిధులతో తారు రోడ్డు మంజూరైంది. ఈ రహదారి పొడవు కట్కూర్ నుంచి దాస్‌తండాకు సుమారుగా 3.5 కిలో మీటర్లు ఉండగా, వంకాయతండా వయా పంచరాయి తండాకు దాదాపుగా 650 మీటర్ల పొడువు ఉంటుంది. అయితే టెండర్ దక్కించుకున్న గుత్తేదారు ఐదారు నెలల కిందట కంకర పోసి బిల్లులు రావడం లేదనే సాకుతో మధ్యలోనే వదిలేశాడు. దీంతో కంకర తేలిన రోడ్డుపై తండావాసులు అవస్థలు పడుతున్నారు.

కంకర రోడ్డుపై కష్టాలు

ఈ మూడు తండాల గిరిజనులు కంకర తేలిన రోడ్డుపై నుంచి ఉదయం, సాయంత్రం కట్కూర్‌లోని పాల కేంద్రంలో పాలు పోసేందుకు పోతుంటారు. ఇక్కడి గిరిజనులు వ్యవసాయంతోపాటు పాల వ్యాపారం ఎక్కువ చేస్తుంటారు. నిత్యం కంకర రోడ్డుపై కన్నీటి ప్రయాణం సాగిస్తున్నామని వాపోతున్నారు. రాత్రి సమయంలో ప్రమాదాల బారిన పడుతున్నారు. ద్విచక్రవాహనాలపై నుంచి యువకులు కిందపడి గాయాల పాలైన ఘటనలు ఉన్నాయి. ఇకనైనా స్థానిక మంత్రివర్యులు దృష్టి సారించి తారురోడ్డు నిర్మాణ పనులు త్వరగా ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకోవాలని తండా వాసులు కోరుతున్నారు.

ఇదే ప్రధాన రహదారి

గిరిజనతండాలైన వంకాయతండా, దాస్‌తండా, పంచరాయితండాలకు ఇదే కంకర తేలిన రోడ్డే ప్రధానరహదారి. దీంతో ఏ చిన్న అవసరాలు వచ్చినా కంకర రోడ్డు మీదుగా కట్కూర్ గ్రామానికి వెళ్లాల్సి వస్తుంది. పాలు నుంచి మొదలుకొని ఉప్పు, పప్పు, నూనె, సబ్బులు మొదలైన వాటి కోసమే కాకుండా జ్వరం, దగ్గు వచ్చిన వెళ్లక తప్పని దుస్థితిలో ఆ తండావాసులు నిత్యం కంకర తేలిన రోడ్డుపై అవస్థలు పడుతున్నారు.

రోడ్డు పూర్తి చేయాలి



కంకర తేలిన రోడ్డుపై ప్రయాణంతో నిత్యం నరకయాతన పడుతున్నాం. ద్విచక్రవాహనాల టైర్లు పూర్తిగా పాడైపోయాయి. కంకర రోడ్డుపై ద్విచక్రవాహనాలు నడపలేక ఉదయం, సాయంత్రం సమయంలో పాలు పోసేందుకు వెళ్లే క్రమంలో వృద్ధులు కింద పడిపోతున్నారు. మంత్రివర్యులు స్పందించి త్వరగా తారు రోడ్డు వేసేలా చర్యలు తీసుకోవాలి.

– భానోతు లింగమూర్తి, మాజీ ఉపసర్పంచ్, వంకాయతండా

తాళం పగులగొట్టి.. ఇంట్లో చోరీ

- రూ.3 లక్షల విలువైన సొత్తు అపహరణ
- సీసీ కెమెరాలో అనుమానితుడు



చిందరవందరగా సామగ్రి, పుటేజీలో అనుమానితుడు

నారాయణఖేడ్: తాళం వేసిన ఇంట్లో గుర్తు తెలియని దొంగలు చోరీకి పాల్పడ్డారు. పోలీసుల కథనం మేరకు.. ఖేడ్ పట్టణంలోని శ్రీనివాస డిగ్రీ కళాశాల ఎదురుగా ముత్యాల ప్రియాంకకు చెందిన రెండంతస్తుల భవనం ఉంది. కానీ ఆమె కుటుంబ సభ్యులతో ఖేడ్‌లోని బంధువుల ఇంటిలో ఉంటుంది.అదే భవనంలో సిర్గాపూర్‌కు చెందిన జగన్మోహన్ కుటుంబీకులతో అద్దెకు ఉంటున్నాడు. ఆదివారం రాత్రి గుర్తు తెలియని దుండగులు ప్రియాంక పోర్షన్‌లో తాళం పగులగొట్టి చోరీకి యత్నించగా ఎలాంటి సొత్తు దొరకలేదు. అనంతరం కింది పోర్షన్‌లో ఉంటున్న జగన్మోహన్ ఇంటికి తాళం వేసి పటాన్‌చెరుకు వెళ్లగా అతడి ఇంట్లో చోరీకి పాల్పడ్డారు. బీరువాలోని సుమారు .3లక్షల విలువైన అరకిలో వెండి, మూడు తులాల బంగారం, అరతులం చొప్పున రెండు బంగారు ఉంగరాలు, రూ.5 వేల నగదు ఎత్తుకెళ్లారు. పోలీసులు చోరీ జరిగిన ఇంటిని పరిశీలించారు. క్లూస్ టీమ్ వేలిముద్రలు, ఇతర ఆధారాలను సేకరించింది. చోరీ సమీపంలోని ఓ ఇంటికి అమర్చిన సీసీ కెమెరాలో గుర్తు తెలియని వ్యక్తి అనుమానాస్పదంగా తిరగడం రికార్డయ్యింది. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వయ్యారి భామ మొక్కలతో ప్రమాదం

తునికి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ శ్రీనివాస్


అవగాహన కల్పిస్తున్న అగ్రికల్చర్ విద్యార్థులు

నర్సాపూర్ రూరల్: వయ్యారి భామ కలుపు మొక్కలతో మనుషులతోపాటు జంతువులకు ప్రమాదం పొంచి ఉంటుందని తునికి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ ఎం.శ్రీనివాస్ అన్నారు. సోమవారం నర్సాపూర్ మండలం ఖాజీపేటలో కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో మల్లారెడ్డి అగ్రికల్చర్ యూనివర్సిటీ విద్యార్థులు వ్యవసాయంపై అవగాహన కల్పించారు. రైతులు వరి కొయ్యలను కాల్చడంతో కలిగే అనర్థాలను వివరించారు. దీని వల్ల భూమిలో ఉష్ణోగ్రత పెరిగి బ్యాక్టీరియా, ఇతర సూక్ష్మజీవులు చనిపోతాయన్నారు. అలాగే సేంద్రియ కార్బనం తగ్గి సారవంతం కోల్పోతుందని తెలిపారు. వయ్యారిభామ మొక్కలకు మనుషులు దూరంగా ఉండాలన్నారు. దాని వాసన పీల్చడం వలన అనేక అనారోగ్య సమస్యలు వస్తాయన్నారు. శ్వాసకోశ సంబంధిత వ్యాధులు సోకుతాయన్నారు. నివారణ కోసం ఎకరాకు 10 లీటర్ల నీటిలో 5 కిలోల ఉప్పు ద్రావణం కలిపి పిచికారీ చేయాలని సూచించారు. కార్యక్రమంలో అగ్రికల్చర్ యూనివర్సిటీ విద్యార్థులు ప్రసన్న, ప్రియాంక, స్వాతిక, సహారిక రెడ్డి, మాధురి, శ్రీజ, రైతులు, తదితరులు పాల్గొన్నారు.


నర్సాపూర్ : విద్యార్థులను అభినందిస్తున్న పాఠశాల బృందం

జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక


విద్యార్థిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు


మెడల్ అందుకుంటున్న అబ్దుల్లా

నర్సాపూర్: పాఠశాలకు చెందిన క్రీడాకారులు జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారని అల్లూరి సీతారామరాజు గిరిజన గురుకుల పాఠశాల, కాలేజీ ప్రిన్సిపాల్‌లు శ్రీనివాస్, రవి తెలిపారు. 23, 24 తేదీల్లో మాసాయిపేటలో రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ సాఫ్ట్‌బాల్ పోటీలు జరుగగా రెండో స్థానంలో నిలిచారని పేర్కొన్నారు. ఇందులో విద్యార్థులు రాహుల్, శ్రీరాం, విజయ్, సంతోష్ ఉన్నారు. ఈ సందర్భంగా క్రీడాకారులను పీడీ లక్ష్మణ్, పీఈటీ రాజు తదితరులు అభినందించారు.

బాక్సింగ్‌లో ప్రతిభ

రామచంద్రాపురం (పటాన్‌చెరు): బీహెచ్‌ఈఎల్ జిల్లా పరిషత్ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న రామచంద్రాపురానికి చెందిన సుంకు హర్షవర్ధన్ రావు రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీలో బంగారు పతకం సాధించారు. సోమవారం పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థిని అభినందించారు. 22 నుంచి 24 వరకు లాలాగూడలో స్కూల్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలు నిర్వహించారని తెలిపారు. వచ్చేనెల ఢిల్లీలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటాడని పేర్కొన్నారు.

రాష్ట్ర స్థాయి హాకీ పోటీలకు..

దుబ్బాకరూరల్: మండలంలోని హబ్సిపూర్‌లో గల మహాత్మా జ్యోతి బాపూలే గురుకుల పాఠశాల విద్యార్థి మిథిల్ హాకీలో ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. ఇటీవలె సంగారెడ్డిలో ఉమ్మడి జిల్లా స్థాయి హాకీ అండర్ 14 విభాగంలో పోటీలు నిర్వహించగా సత్తా చాటాడు. 28, 29 తేదీల్లో కరీంనగర్ జిల్లా హుజురాబాద్‌లో జరిగే రాష్ట్ర స్థాయి హాకీ పోటీల్లో పాల్గొంటారని పాఠశాల ప్రిన్సిపాల్ గోపాల్‌రెడ్డి తెలిపారు. సోమవారం పీఈటీ తరుణ్‌రాజ్‌ను ఉపాధ్యాయ బృందం అభినందించారు.

కరాటేలో గోల్డ్ మెడల్

మెదక్ మున్సిపాలిటీ: రాష్ట్రస్థాయి 68వ స్కూల్ గేమ్స్ ఆఫ్ ఫెడరేషన్ గేమ్స్ కరాటేలో మెదక్ పట్టణానికి చెందిన అబ్దుల్లా గోల్డ్ మెడల్ సాధించినట్లు కరాటే మాస్టర్ నగేశ్ తెలిపారు. పెద్దపల్లి జిల్లా రామగుండంలో ఆదివారం పోటీలు నిర్వహించగా హెవీ వెయిట్ కేటగిరిలో పతకం సాధించినట్లు పేర్కొన్నారు. వచ్చేనెల ఢిల్లీలో జరిగే జాతీయ స్థాయి ఎస్‌జీఎఫ్ క్రీడల్లో రాష్ట్రం తరఫున పాల్గొంటాడని తెలిపారు. అబ్దుల్లా తొమ్మిదేళ్లుగా జిల్లా కేంద్రంలోని గుల్షన్ క్లబ్‌లో శిక్షణ పొందుతున్నాడు. గతేడాది రాష్ట్రస్థాయి ఎస్జీఎఫ్‌లో రెండో స్థానం సాధించాడు.

మనవడిని చూసేందుకు వెళ్తూ..

- రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

సదాశివపేట రూరల్ (సంగారెడ్డి): రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన మండల పరిధిలోని ఆరూర్ గ్రామ శివారులో సోమవారం చోటు చేసుకుంది. సీఐ మహేశ్ గౌడ్ కథనం మేరకు.. కోహీర్ మండలంలోని వెంకటాపూర్ గ్రామానికి చెందిన పిచకుంట్ల నాగయ్య(56) కూలీ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. సంగారెడ్డి పట్టణంలో ఉండే తన మనవడిని చూసేందుకు బైక్‌పై వెళ్తున్నాడు. ఆరూర్ గ్రామ శివారులోకి రాగానే లారీ ఢీకొట్టడంతో తీవ్ర గాయాలై నాగయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని..

మనోహరాబాద్(తూప్రాన్): గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన మనోహరాబాద్‌లో చోటు చేసుకుంది. సోమవారం ఎస్ఐ సుభాష్‌గౌడ్ కథనం మేరకు.. మండలంలోని కాళ్లకల్ గ్రామ శివారులో జాతీయ రహదారి 44పై గుర్తు తెలియని వ్యక్తి ఆదివారం రాత్రి దీపక్ దాబాలో భోజనం తిని రోడ్డు దాటుతున్నాడు. ఈ క్రమంలో గుర్తు తెలియని వాహనం ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి వయస్సు సుమారు 25 నుంచి 30 ఏళ్ల వరకు ఉంటుందని తెలిపారు. మృతుడు వివరాలు తెలియాల్సి ఉందని, కాళ్లకల్ పంచాయతీ కార్యదర్శి రాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి..

చిలప్‌చెడ్(నర్సాపూర్): రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. సోమవారం ఏఎస్ఐ మిస్బావుద్దీన్ కథనం మేరకు.. మండల పరిధిలోని శీలాంపల్లి గేటు వద్ద 21 ఎదురెదురుగా రెండు బైకులు ఢీకొన్నాయి. ఈ ఘటనలో మండల పరిధిలోని ఫైజాబాద్ గ్రామానికి చెందిన టేకుల మల్లారెడ్డి (45) తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం సంగారెడ్డిలోని ఓ ఆస్పత్రికి తరలించగా చికిత్సపొందుతూ మృతి చెందాడు.

పందుల దొంగలు రిమాండ్


వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ పురుషోత్తంరెడ్డి

- పోలీసుల అదుపులో నలుగురు, మరో ఇద్దరు పరారీలో..
- జల్సాలకు అలవాటు పడి చోరీలు
- గజ్వేల్ ఏసీపీ పురుషోత్తంరెడ్డి

కొండపాక(గజ్వేల్): పందులను దొంగిలించిన నలుగురు నిందితులను పట్టుకొని రిమాండ్‌కు తరలించినట్లు గజ్వేల్ ఏసీపీ పురుషోత్తంరెడ్డి పేర్కొన్నారు. కుకునూరుపల్లి పోలీస్‌స్టేషన్‌లో తొగుట సీఐ లతీఫ్, ఎస్సై శ్రీనివాస్‌లతో కలిసి విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి వివరాలు వెల్లడించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లందు గ్రామానికి చెందిన మూడ్ సురేశ్‌కుమార్, నల్గొండ రాము, మేడ వీరన్న, నల్లొండ వీరన్న నలుగురు స్నేహితులుగా ఏర్పడి వివిధ చోట్ల పందులను దొంగిలిస్తూ వచ్చే డబ్బులతో జల్సాలకు అలవాటు పడ్డారు. ఇటీవల గజ్వేల్ పట్టణానికి చెందిన తుప్పరి సాదుల్ల, నూనె రమేశ్ కొత్తగా స్నేహితులు కాగా పందుల దొంగతనాల విషయాన్ని చెప్పారు. 18న కుకునూరుపల్లి పోలీస్టేషన్ పరిధిలోని కొడకండ్ల గ్రామంలో 35 పందులను దొంగిలించడంతోపాటు జిల్లా వ్యాప్తంగా పలు చోట్ల దొంగతనాలకు పాల్పడ్డారు. బాధితుడు క్షీరసాగరం స్వామి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నిందితులు సోమవారం జనగాం నుంచి సిద్దిపేటకు టాటాఏస్ వాహనంలో పందులను తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. నలుగురు నిందితులను విచారించగా పలు చోట్ల దొంగతనాలు చేసినట్లు ఒప్పుకున్నారు. వారి వద్ద నుంచి 33 పందులు, రూ.75,000 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. ఇప్పటికే వీరిపై పలు పోలీస్‌స్టేషన్లలో కేసులు ఉన్నాయన్నారు. తుప్పరి సాదుల్ల, నూనె రమేశ్ పరారీలో ఉండగా పట్టుబడిన నలుగురు నిందుతులను కోర్టులో హాజరుపర్చగా జడ్జి జ్యూడిషియల్ రిమాండ్‌కు తరలించాలని తీర్పునిచ్చినట్లు తెలిపారు. నిందితులను పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన సీఐ లతీఫ్, ఎస్సై శ్రీనివాస్ తోపాటు పలువురు కానిస్టేబుళ్లను ఆయన ప్రత్యేకంగా అభినందించారు.

సీపీని కలిసిన ఎరుకల సంఘం నాయకులు

సిద్దిపేటకమాన్: పందుల దొంగతనాల కేసును త్వరగా ఛేదించినందున ఎరుకల సంఘం నాయకులు పోలీసు కమిషనర్ కార్యాలయంలో సీపీ అనురాధను సోమవారం మర్యాద పూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాలో కుకునూర్‌పల్లి, దుబ్బాక, గౌరారం, మర్కూక్ పోలీసు స్టేషన్‌ల పరిధిలో పలు చోట్ల జరిగిన పందుల దొంగతనం కేసులను ఛేదించి పందులు, నగదును రికవరీ చేయడంపై హర్షం వ్యక్తం చేశారు.

సమీకృతం.. పనులు సగం

ఏళ్లు గడుస్తున్నా పూర్తికాని కార్యాలయ భవనం


అసంపూర్తిగా సమీకృత భవనం

- ఇతర భవనాల్లో తాత్కాలికంగా విధులు
- కొత్త సర్కార్‌లోనూ ముందుకు సాగని పనులు
- త్వరగా ప్రారంభించాలంటున్న ప్రజలు

చేర్యాల(సిద్దిపేట): పట్టణ కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో రూ.కోట్ల నిధులతో చేపట్టిన సమీకృత కార్యాలయ భవన నిర్మాణం ఏళ్లు గడుస్తున్నా పూర్తి కావడంలేదు. ప్రభుత్వ పనులు ప్రారంభించిన నాటి నుంచి నిర్ణీత సమయంలో పూర్తి చేయాల్సి ఉంటుంది. కానీ పట్టణ కేంద్రంలో నిర్మిస్తున్న సమీకృత భవన నిర్మాణం మాత్రం శంకుస్థాపన చేసి ఆరేళ్లు దాటింది. అయినా పనులు పూర్తి కాలేదు.

రూ.17 కోట్లు మంజూరు

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అప్పటి సీఎం కేసీఆర్ ఇచ్చిన మాట ప్రకారం పట్టణ కేంద్రంలో సమీకృత భవన నిర్మాణానికి రాష్ట్ర ప్రత్యేక అభివృద్ధి నిధుల నుంచి రూ.17 కోట్లు మంజూరు చేశారు. అధికారులు టెండర్లు పిలువగా ఓ సంస్థ దక్కించుకుంది. సకాలంలో పనులు పూర్తి చేయక పోగా కొన్ని రోజుల తర్వాత అదే కంపెనీకి చెందిన మరో కాంట్రాక్టర్ పనులు ప్రారంభించాడు. అయినా పూర్తి చేయలేదు. ఇలా ఆగుతూ సాగుతూ గడుస్తున్న క్రమంలో రెండేళ్ల కిందట మరో కంపెనీ పనులు అప్పగించారు.

అప్పటి మంత్రి వారించినా..

భవన నిర్మాణ పనులు జరుగుతున్న క్రమంలో 2021 ఆగస్టు 9న అప్పటి మంత్రి హరీశ్‌రావు పరిశీలించారు. పరిస్థితిని చూసి సంబంధిత అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేయడంతోపాటు మూడేళ్లు గడిచినా పనులు పూర్తి కాకపోవడమేంటని ప్రశ్నించారు. 2022 ఏప్రిల్ 6వ తేదీన మరో మారు పట్టణానికి వచ్చిన హరీశ్‌రావు పనులు పరిశీలించి పనుల్లో వేగం పెంచాలని, అవసరమైతే కాంట్రాక్టర్‌ను మార్చి వేరే వారితో పనులు త్వరగా పూర్తి చేయించాలని పంచాయతీరాజ్ ఈఈ, డీఈలకు ఆదేశించారు. ఇది ఇలా ఉంటే మున్సిపల్, ఎంపీడీఓ కార్యాలయాల కోసమైనా కొన్ని గదులను త్వరగా పూర్తి చేసి ఇవ్వాలని చెప్పినా ఫలితం లేదు. మున్సిపల్, ఎంపీడీఓ కార్యాలయాలను తాత్కాలికంగా ఇతర భవనాల్లో నిర్వహిస్తున్నారు.

గాడి తప్పుతున్న పాలన..

పట్టణ, మండల పరిధిలోని వివిధ గ్రామాల ప్రజలకు మండలస్థాయి సేవలు అందించే కార్యాలయాలు పట్టణ నలుమూలల్లో ఉండడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గతంలో మున్సిపల్ కార్యాలయం కొనసాగిన భవనాన్ని కూల్చివేసి ఆ స్థలంలో నాన్‌వెజ్ మార్కెట్ నిర్మాణం చేయడంతో హాస్టల్ భవనంలో మున్సిపల్ తాత్కాలిక కార్యాలయం నిర్వహిస్తున్నారు. ఎంపీడీఓ కార్యాలయాన్ని కోర్టుకు అప్పగించి పక్కనే ఉన్న స్త్రీ శిశు భవనంలోని రెండు గదుల్లో ఎంపీడీఓ కార్యాలయం నిర్వహిస్తున్నారు. ఇలా కార్యాలయాలు వేర్వేరు చోట్ల ఉండడంతో ప్రజలకు అందాల్సిన పలు సేవలు సకాలంలో అందక పాలన గాడి తప్పుతుందన్న వాదనలు వినిపిస్తున్నాయి. పనుల నిమిత్తం వచ్చే వారికి ఒక్కో పనికి రోజంతా సమయం పడుతోంది. నాలుగు పనులు ఒకే రోజు పూర్తి చేసుకొని వెళ్లాలని వస్తే ఏ పనీ కావడం లేదని ప్రజలు వాపోతున్నారు.

ఆరేళ్లు గడుస్తుంది



గత ప్రభుత్వ హయాంలో ప్రారంభించిన పనులు ఆరేళ్లు గడుస్తున్నా పూర్తి కాలేదు. మండల స్థాయి కార్యాలయాలు వేర్వేరు చోట్ల ఉండటంతో పనుల నిమిత్తం వెళ్లాలంటే ఇబ్బంది అవుతుంది. కొత్త ప్రభుత్వం వచ్చి ఏడాది అవుతున్నా పనులు ముందుకు సాగడం లేదు. దీనిపై స్థానిక నాయకులు, అధికారులు స్పందించి వెంటనే పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలి.

– ఆవుల సందీప్, నాగపురి

త్వరలో పూర్తి చేయిస్తాం

మొదట టెండర్లు దక్కించుకున్న కాంట్రాక్టర్ సకాలంలో పనులు పూర్తి చేయకపోవడంతో రెండేళ్ల కిందట కాంట్రాక్టర్‌ను మార్చాం. ప్రస్తుతం సింధూర కన్‌స్ట్రక్షన్ వారు పనులు చేస్తున్నారు. గతేడాది నవంబర్ నుంచి బిల్లుల చెల్లింపులు లేక పనులు ఆలస్యమవుతున్నాయి. పనులు చివరి దశకు వచ్చాయి. పనులు మొదలు పెట్టి త్వరలో పూర్తి చేయించి ప్రజలకు అందుబాటులోకి తెస్తాం.

– శ్రీనివాస్‌రెడ్డి, పీఆర్ డీఈఈ

యూనివర్సిటీకి పరిశోధనలే వెన్నెముక

- అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలి
- ములుగు ఉద్యాన యూనివర్సిటీ వీసీ డాక్టర్ రాజిరెడ్డి

ములుగు(గజ్వేల్): యూనివర్సిటీకి విస్తృత పరిశోధనలే వెన్నెముక అని, వాటికి శాస్త్రవేత్తలు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని ములుగులోని కొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం వైస్ ఛాన్స్‌లర్ డాక్టర్ దండ రాజిరెడ్డి అన్నారు. సోమవారం యూనివర్సిటీ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన ద్వైమాసిక సమావేశంలో యూనివర్సిటీ డైరెక్టర్లు, అధికారులు, శాస్త్రవేత్తలను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. రైతుల గ్రాస్ రూట్‌లెవల్‌లో సమస్యలపై శాస్త్రవేత్తలు విస్తృతంగా కృషి చేయాలన్నారు. రైతులను ఆదుకునే పరిశోధనలు సంతృప్తినిస్తాయన్నారు. స్టార్టప్‌లకు సరైన దిశానిర్దేశంలో విద్యార్థులను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దాలని పిలుపునిచ్చారు. యూనివర్సిటీ రీసెర్చ్ స్కాలర్లు ఉద్యాన పంటలపై, అధునాతన పరిశోధనలపై దృష్టి సారించాలన్నారు. శాస్త్రవేత్తలు ఆ బృందంతో మమేకమై అత్యుత్తమ ఫలితాలు తేవాలన్నారు. సమావేశంలో యూనివర్సిటీ అధికారులు, డీన్లు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న వీసీ డాక్టర్ రాజిరెడ్డి